క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట: పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 11 కేవీ బోడిపాలెం ఫీడర్ విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేస్తున్నట్టు చెప్పారు. చినగూళ్లపాలెం, పెదగూళ్లపాలెం, బొరుసువారి సావరం, గౌతమీనగర్, బాలయోగిపేట, శ్రీనివాసపేట, రెడ్డప్పవారిపేట, బ్యాంక్ కాలనీ, గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు మూడు గ్రామాల్లో..

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మూడు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎన్‌హెచ్ అధికారులు చెట్లు తొలగిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

మొక్కల పెంపకాన్ని అలవర్చుకోవాలి

అంబాజీపేట: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడాన్ని అలవాటు చేసుకుని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అన్నారు. ఎస్టీయూ వజ్రోత్సవాల్లో భాగంగా లక్ష మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో, మండల రీసోర్స్ కార్యాలయంలో గురువారం మొక్కలు నాటారు.

పార్టీ ఉన్నతికి కృషి చేస్తా : చిట్టిబొమ్మ



చిట్టిబొమ్మ వెంకట వరప్రసాద్

అయినవిల్లి: సేవాభావంతో పని చేసి పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని జై భారత్ నేషనల్ పార్టీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోఆర్డినేటర్ చిట్టిబొమ్మ వెంకట వరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన ముక్తేశ్వరంలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ పిలుపు మేరకు గ్రామాల్లో యువకులను, సంఘ నాయకులతో కలిసి ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బీనాజాన్

అయినవిల్లి: ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షిక స్పోర్ట్స్ మీట్ గురువారం ముగిసింది. వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ బీనాజాన్ బహుమతీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్‌వీవీ ప్రసాద్, ప్రిన్సిపాల్ బీనాజాన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

పి.గన్నవరం: అమలాపురంలో ఈ నెల ఏడున జరగనున్న సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వంటెద్దు బాబీ కోరారు. ఎల్.గన్నవరంలో పార్టీ మండల అధ్యక్షుడు చిట్టాల రామజోగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో బాబీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ బస్సుయాత్రలో కేంద్ర మాజీ మంత్రి శీలం జేడీ, సీడబ్ల్యూసీ మెంబర్ మల్లిపూడి పల్లంరాజు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జంగా గౌతమ్ తదితరులు పాల్గొంటారన్నారు. ఏఐసీసీ సభ్యుడు యాలగడ్డ రవీంద్ర, పీసీసీ ప్రధాన కార్యదర్శులు మహ్మద్ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ, అమలాపురం కన్వీనర్ వాకపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

అయినవిల్లి: ఓ కళాశాల సమీపంలోని కాలువ గట్టు వద్ద పేకాడుతున్న ఆరుగురిని ఎస్సై కె.సురేష్‌బాబు అరెస్టు చేశారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై సురేష్‌బాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,060 స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు తరలించనున్నట్టు ఎస్సై తెలిపారు.

శంకరగుప్తంలో అగ్ని ప్రమాదం

మలికిపురం: మండలంలోని శంకరగుప్తంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇంజేటి వసంతరావుకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో ఉన్న కిరాణా దుకాణం కాలి బూడిదైంది. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించినట్టు బాధితుడు తెలిపారు. బీరువాలో భద్రపరిచిన రూ.లక్ష నగదు కాలిపోయినట్టు పేర్కొన్నారు. బాధితుడి నుంచి సంఘటన వివరాలను వీఆర్వో నల్లి బాలకృష్ణ సేకరించారు. ఆస్తి నష్టం రూ.15 లక్షల వరకు ఉండవచ్చని వీఆర్వో తెలిపారు.

ఆడపడుచులకు స్థిరాస్తి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- బిళ్లకుర్రులో 136 మంది మహిళలకు ఇళ్ల స్థలాల అప్పగింత



బిళ్లకుర్రులో ఇంటి స్థలం అప్పగించి, పసుపు కుంకుమలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో అర్హులైన ఆడపడుచులందరికీ ఇళ్ల స్థలాలిచ్చి, సొంతింటి కల నెరవేర్చడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి సుమారు రూ.10 లక్షల విలువైన స్థిరాస్తి కల్పిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. మండలంలోని బిళ్లకుర్రు గ్రామంలో 136 మందికి ఇళ్ల స్థలాల స్వాధీనపర్చే కార్యక్రమాన్ని గురువారం పండగ వాతావరణంలో నిర్వహించారు. లబ్ధిదారులకు స్థలం పట్టాతో పాటు, జగ్గిరెడ్డి సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు అందజేశారు. సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో, మళ్లీ ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని వివరించారు.

టీడీపీ హయాంలో అర్జీలు బుట్టదాఖలే..

గత టీడీపీ ప్రభుత్వంలో స్థలాలిచ్చిన దాఖలాలు లేవన్నారు. ఆ పార్టీ నేతల చుట్టూ, ఆఫీసుల చుట్టూ, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి అర్జీలిస్తే, వాటిని బుట్టదాఖలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి అర్జీకి జవాబుదారీ ఉందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళల పేరునే ఇళ్ల స్థలాలు ఇవ్వడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రక ఘట్టానికి నాంది పలికారన్నారు. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆడపడుచు కట్నం అన్నారు. ప్రతి స్థలం రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల విలువ చేస్తుందన్నారు. దీన్ని ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రోడ్లు, విద్యుత్ సౌకర్యం కలిప్పించి, ఇళ్లు నిర్మించేకార్యక్రమం చేపడతారని వెల్లడించారు. భవిష్యత్తులో ఆయా పథకాలన్నీ అమలు చేసే సత్తా ఒక్క జగన్‌కే ఉందన్నారు. రాబోయే రోజుల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలిచి, పుట్టింటి లాంటి ఈ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. అనంతరం రూ.15.75 లక్షలతో నిర్మించిన బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, వైఎస్సార్ సీపీ నాయకుడు కాకర సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

ఆలమూరు: రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా పింఛనును రూ.మూడు వేలకు పెంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై తనకున్న మమకారాన్ని చాటుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పింఛను వయస్సును 60 ఏళ్లకు కుదించి, అర్హులకు ఎలాంటి సిఫార్సులు లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా పింఛన్లను మంజూరు చేశారని గుర్తుచేశారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణను తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీలు, ధరలు పెరిగి పోయాయని గగ్గోలు పెడుతున్నాయన్నారు. ధరల పెరుగుల జాతీయ స్థాయిలో ద్రవ్యోల్బణంపై ఆధారపడి ఉంటుందనే విషయం వారికి తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కొత్తపేట నియోజకవర్గంలో ప్రస్తుతం 44,353 మందికి పింఛనుదారులకు ప్రతి నెలా రూ.13.28 కోట్లు అందిస్తున్నట్టు వివరించారు. అనంతరం మండలంలో కొత్తగా మంజూరైన 168 మందితో పాటు, మిగిలిన 11,321 మందికి పెంచిన రూ.మూడు వేల పింఛను పథకాన్ని ఆయన ప్రారంభించారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీకి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శ్రీకారం చుట్టారు. మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో 22,939 మందికి కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా, తొలి విడతగా 14,904 మందికి ఆయన అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా సచివాలయాల్లో అందజేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

మలికిపురం: మండలంలోని లక్కవరంలో గురువారం మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గడిచిన నాలుగున్నరేళ్లల్లో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎనీమియా ముక్త భారతే లక్ష్యం

ఆలమూరు: వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీ శంకర్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ అందించారు. ప్రతి గురువారం డ్రాప్స్ అందించనున్నట్టు వైద్యాధికారులు పేర్కొన్నారు.

వైభవంగా కాలభైరవాష్టమి పూజలు



కాలభైరవాష్టమి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

ఆలమూరు: జొన్నాడలో ఉన్న అన్నపూర్ణ సమేత దక్షిణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం కాల భైరవాష్టమి పూజలు వైభవంగా జరిగాయి. శ్రీశోభకృత్ నామ సంవత్సర మార్గశిర బహుళ అష్టమి రోజున ఈ కాలభైరవ జయంతిని జరపడం ఆనవాయితీగా వస్తోంది. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఆలయ కమిటీ పర్యవేక్షణలో పురోహితులు పూజలు నిర్వహించారు. ఈ కాలభైరవాష్టమి పూజలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

అవ్వాతాతలకు ఆర్థిక భరోసా

- ఇకపై ప్రతి నెలా రూ.మూడు వేల పింఛను
- ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వెల్లడి

ఆత్రేయపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇకపై వైఎస్సార్ పింఛను కానుక రూపంలో ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వాతాతలకు రూ.మూడు వేలు అందిస్తోందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన 3,648 కి.మీ. సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో అవ్వాతాతల కష్టాలు స్వయంగా వీక్షించి, పింఛన్లను దశలవారీగా రూ.మూడు వేలకు పెంచారన్నారు. వృద్ధాప్య పింఛను 2019లో ఎన్నికలకు రెండు నెలల ముందు రూ.వెయ్యిగా ఉండేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వచ్చాక తొలి సంతకం చేసి రూ.2,250కి పెంచిందని గుర్తుచేశారు. అలాగే 2022, జనవరిలో రూ.2500, 2023లో రూ.2750, తాజాగా ఈ ఏడాది రూ.మూడు వేలు చేసినట్టు వివరించారు.

కొత్త పింఛన్ల మంజూరు

ఆత్రేయపురం మండలంలో కొత్తగా మంజూరైన 186 పింఛన్లు కలిపి మొత్తం 10,017 మంది లబ్ధిదారులకు రూ.2,86,98,500 వైఎస్సార్ పింఛను రూపంలో అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో, మళ్లీ ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉన్న అందరికీ పింఛను మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి ప్రభుత్వ కార్యాలయాల వద్ద వేచిచూసే పనిలేకుండా, ఉదయమే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛను పంపుతున్నట్టు తెలిపారు.

ఓర్వలేని విపక్షాలు

అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛను కానుక లాంటి పథకాలు ప్రజలకు అందజేయడంతో ప్రతిపక్షాలు ఓర్వలేక, విమర్శలు చేస్తున్నారని జగ్గిరెడ్డి మండిపడ్డారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో నూతన పింఛను పొందాలంటే, పాత పింఛనుదారు ఎవరైనా మరణిస్తే మినహా కొత్తది మంజూరు చేసేవారు కాదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగార్రాజు, సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు, గాదిరాజు రామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, ఎంపీడీఓ నాతిబుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

వెలువలపల్లిలో పింఛను కానుక

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లి సచివాలయంలో వైఎస్సార్ పింఛను కానుక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. లబ్ధిదారులకు పెంచిన రూ.మూడు వేల పింఛనును సర్పంచ్ బొంతు మణి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన నాయకుడు మద్దింశెట్టి రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటీశ్వరరావు, సచివాలయ కన్వీనర్ చోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బాలరాముడి అక్షతల పంపిణీ

సఖినేటిపల్లి: అయోధ్యలో పూజలందుకున్న బాలరాముడి అక్షతలను గురువారం మోరి గ్రామంలో ఇంటింటా శ్రీరామ భక్తులు పంపిణీ చేశారు. అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవ ఆహ్వానాలనూ అందజేశారు. తొలుత రామాలయంలో స్వామివారి సన్నిధిలో అక్షతల కలశను ఉంచి, అర్చకుడు వాడపల్లి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీలో స్వామివారి ఉత్సవమూర్తులు, అక్షతల కలశను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. 22న ఇళ్ల వద్ద దీపాలు వెలిగించాలని ఆచార్యులు కోరారు.

కె.పెదపూడిలో..

అంబాజీపేట: రామ జన్మభూమి తీర్థయాత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో కె.పెదపూడి గ్రామంలో అయోధ్య రాముని అక్షతల ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అక్షతలు, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దలు పెయ్యేటి నరసింహరావు, గుంటూరి మురళీకృష్ణంరాజు, పెదపూడి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పెదపట్నంలంకలో అక్షతల వితరణలో పాల్గొన్న భక్తులు

పెదపట్నంలంకలో..

మామిడికుదురు: అయోధ్య రాముని అక్షతల వితరణ కార్యక్రమం పెదపట్నంలంకలో ఘనంగా జరిగింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ వైభవంగా నిర్వహించారు. కోదండ రామాలయం, ఉమా సత్యలింగేశ్వరస్వామి ఆలయం నుంచి ఊరేగింపు నిర్వహించి, ఇంటింటికీ అక్షతలను అందజేశారు.

సమరసత సంస్థ ఆధ్వర్యంలో..

అయినవిల్లి: అయోధ్య శ్రీరాముని అక్షతలను సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిరిపల్లి గ్రామంలో ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



మోరిలో పల్లకీలో స్వామి ఉత్సవమూర్తులను, అక్షతల కలశను ఊరేగిస్తున్న భక్తులు

పథకాలను వివరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..

- మోదుకూరు గడప గడపకూ.. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ, గ్రామంలో సమస్యలు తెలుసుకుని.. అక్కడికక్కడే పరిష్కరిస్తూ మోదుకూరులో గురువారం సాయంత్రం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ పెంటపాటి శ్యామల, పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లి రాజు, ఎంపీటీసీ చుండ్రు సునీత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ నవరత్నాల వల్ల కలిగిన లబ్ధిని గణాంకాలతో సహా ప్రజలకు వివరించారు. గ్రామస్తుల సందేహాలను నివృత్తి చేసి, కార్యదీక్షతో ముందుకు సాగారు. గ్రామంలో నవరత్నాల పథకాలతో రూ.11.28 కోట్ల లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పరిగణనలోకి తీసుకుని రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని జగ్గిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



మోదుకూరులో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అర్హులకు ఇళ్ల స్థలాల పంపిణీ

స్థానిక వైఎస్సార్ జగనన్న కాలనీలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ జరిగింది. 1.27 ఎకరాల్లో సుమారు రూ.మూడు కోట్ల విలువైన స్థలాల పట్టాలను 48 మందికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అందజేశారు. ఈ కాలనీలో త్వరలోనే అధునాతన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో 17,497 మందికి ఇళ్ల స్థలాలు అందించినట్టు పేర్కొన్నారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై విద్యార్థులకు భయాందోళన వద్దు



సదస్సులో మాట్లాడుతున్న పీడీ జ్యోతిలక్ష్మీదేవి

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎదుర్కొనే విద్యార్థులు భయాందోళనకు గురికావద్దని ఎస్సీ సంక్షేమ శాఖ పీడీ పి.జ్యోతిలక్ష్మీదేవి అన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించడంపై గురువారం ప్రేరణ అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి పరిధిలోని తొమ్మిది వసతి గృహాలకు చెందిన 140 మంది విద్యార్థులు సదస్సుకు హాజరయ్యారు. ఏఎస్‌డబ్ల్యూఓ కేవీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ పీడీ పి.జ్యోతిలక్ష్మి దేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం పీడీ జ్యోతిలక్ష్మీదేవి మాట్లాడుతూ పరీక్షల్లో మెళకువలు, మోడల్ పేపర్లకు అన్సర్ చేయడం, సమయపాలనపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు నాగరాజు, నాగేంద్ర కుమార్, హనుమంతరావు, ఎం.శ్రీను, ఆనందకుమార్ విద్యార్థులకు పలు సబ్జెక్టులపై అవగాహన కలిప్పించారు. హెచ్‌ఎంలు సుభాషిణి, సరస్వతి, రామచంద్రాపురం, అమలాపురం ఏఎస్‌డబ్ల్యూఓలు ఎస్.సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు, వసతి గృహాధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర కుంకుమార్చన



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కొత్తపేట: సత్యసాయి మందిరంలో గురువారం సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్గశిర మాసం గురువారం సందర్భంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ, సమితి సభ్యుల ఆధ్వర్యంలో మహిళలతో లక్ష్మీదేవికి సామూహిక కుంకుమ పూజలు జరిపించారు.

ఉచిత వైద్య శిబిరాలతో మేలు

- ఎమ్మెల్యేలు రాపాక, కొండేటి

రాజోలు: నిరుపేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఎంతో మేలు జరుగుతుందని రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు అన్నారు. గురువారం తాటిపాక సోమిశెట్టి ల్యాండ్ మార్క్ వద్ద సోమిశెట్టి ఆంజనేయులు, నాగలక్ష్మి ఫౌండేషన్ సౌజన్యంతో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యంతో పాటు గుండె, షుగర్, ఊపిరితిత్తులు, గైనకాలజీ, ఈఎన్టీ, ఆర్థో, చిన్నపిల్లలు, చర్మ వ్యాధుల నిపుణులు వైద్య సేవలందించారు. సుమారు 546 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

ప్రతి ఒక్కరికీ క్రీస్తు బోధనలు మార్గదర్శకం



అంబాజీపేటలో ఐక్య క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న సంఘీయులు

అంబాజీపేట: క్రీస్తు బోధనలు ప్రతిఒక్కరికీ మార్గదర్శకమని, క్రీస్తు సూక్తులు ఆచరిస్తూ.. శాంతి సమాధానాలతో జీవించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జె.డానియేలు అన్నారు. అంబాజీపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో స్థానిక పాత పెట్రోల్ బంక్ ఎదురుగా ఫెలోషిప్ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.లాజర్ అధ్యక్షతన బుధవారం రాత్రి ఐక్య క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ జె.డానియేలు ప్రసంగిస్తూ లోకానికి ఏసు క్రీస్తు ద్వారా వెలుగు వచ్చిందని, ఆ వెలుగును మన జీవితాల్లో ప్రకాశించేలా చూసుకోవాలన్నారు. క్రీస్తు పుట్టుకలోని అంతర్యాన్ని వివరించారు. అనంతరం ప్రార్థనలు చేసి, క్రిస్మస్ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ధనరాజ్ చికిలే, సీహెచ్ కృపాపాల్, కసుమ రత్నం, కె.విజయకుమార్, సీహెచ్ కుణాకర్, కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ జేఏసీ క్రిస్మస్ వేడుకలు

రావులపాలెం: ప్రపంచానికి శాంతి సందేశం అందించిన క్రీస్తు క్రిస్మస్ వేడుకలు మండలంలోని ఈతకోటలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక గంటి రోడ్డులోని ఒలీవల స్వస్థత శాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ జేఏసీ అధ్యక్షుడు పమ్మి అమృతరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ మత ప్రబోధకుడు సీహెచ్ మోజెస్, పీఎస్ ఝెన్ మూర్తి ముఖ్యఅతిథులుగా ప్రసంగించారు. క్రీస్తు సువార్త ప్రతి వ్యక్తికి అందజేయాలని సూచించారు. రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలకు చెందిన మత ప్రబోధకులు కుటుంబ సమేతంగా పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు యు.సుందరం విజయం, వి.డేవిడ్‌రాజు, దయాకర్ పాల్, రాజశేఖర్, రాజేష్, ముస్లిమణి, జీవన్ ప్రసాద్, దానియేలు, యాకోబు, సత్యానందం, నేరేడుమిల్లి నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, రొక్కల ఎలీషా, నైనా, నవ్య తదితరులు పాల్గొన్నారు.



ఈతకోటలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్న మండల పాస్టర్స్ జేఏసీ

ఘనంగా దత్తాత్రేయస్వామి వార్షిక అనఘావ్రతం

కొత్తపేట: కోనసీమ షిర్డీగా పేరుగాంచిన స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉన్న గురుదత్తాత్రేయస్వామివారి వార్షిక అనఘావ్రత కార్యక్రమాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా అష్టమి తిథి రోజున సాధారణ అనఘావ్రతం, మార్గశిర మాసంలో అష్టమి నాడు వార్షిక అనఘావ్రతం ఆనవాయితీగా నిర్వహిస్తారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు గోవిందవఝ్యల నరసింహశర్మ, బోడిపాలెం విజయ కనకదుర్గాదేవి, అభయాంజనేయ స్వామివారి ఆలయాల ప్రధానార్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు ఉదయం నుంచి వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, గోపూజ, దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, కలశపూజ జరిపారు. అనంతరం ప్రసాద వితరణ, పూజలో పాల్గొన్న భక్తులకు షిర్డీసాయిబాబా, దత్తాత్రేయస్వామి చిత్రపటాలు, హాట్ క్యారియర్ కానుకగా పంపిణీ చేశారు. అనంతరం భారీఎత్తున అన్న సమారాధన జరిగింది.



ప్రత్యేక అలంకరణలో కొత్తపేట దత్తాత్రేయ మందిరం